క్లుప్తంగా

వేణుగోపాలుని దర్శించుకున్న స్వామిదాసు



తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజక వర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు శుక్రవారం నెమలి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం కల్యాణ వేడుకలకు విచ్చేసిన భక్తులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, పార్టీ నాయకులు అలపాటి ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా ప్రభుత్వ ఖాజీ హబీబుల్లా హుస్సేని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం శుక్రవారం కొండపల్లిలోని ఖాజీ మసీదు వద్ద జరిగింది. కార్యక్రమంలో ముస్లిం నాయకుడు ఎంఏ బేగ్, ఖాజీ కుటుంబ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వెల్లటూరులో గ్రామోత్సవం

జి.కొండూరు: వెల్లటూరు వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పండితుడు కోమారి వెంకటాచారి ఆధ్వర్యంలో స్వామి వారిని మేళతాళాలతో గ్రామంలో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయంలో మహా శాంతి హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

ఘనంగా కారల్ మార్క్స్ వర్ధంతి

తిరువూరు: పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలన కోసం కారల్ మార్క్స్ పోరాడారని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూము కృష్ణయ్య అన్నారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో శుక్రవారం మార్క్స్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులకు మార్గదర్శిగా నిలిచిన మార్క్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచిగా కూడా ఖ్యాతి గాంచారని వివరించారు. నాయకులు మాలపాటి ఉదయ్, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, సుబానీ, అశోక్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల స్పెషల్ డ్రైవ్



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్ అధికారులు గత ఐదు రోజులుగా జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 17 మందిపై కేసులు నమోదు చేశారు. 13 బెల్టు దుకాణాల్లో 137 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని 13 మందిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ మద్యం విక్రయిస్తున్న మరో నలుగురిపై కేసులు నమోదు చేసి 33 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమంలో భాగంగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

కల్యాణ మండపం ప్రారంభం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం షాబాదు గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మతల్లి అమ్మవారి కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో కాకుండా గ్రామస్తులే విరాళాలు సేకరించి కల్యాణ మండపం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్. వెంకటకృష్ణ, ఎడ్ల మధుసూదనరావు, గంధం సుబ్బారావు, గర్వేపూడి మాధవరావు, మేడూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి కల్యాణం

తిరువూరు: స్థానిక జూనియర్ కళాశాల సమీపంలోని రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీమాన్ సుదర్శనం వెంకటేష్ ఆచార్యులు, వేదాంతం వెంకట నాగసతీష్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అనంతరం ఉభయ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు పర్యవేక్షించారు.

వైభవంగా గరుడ వాహన సేవ

తిరువూరు: తిరువూరులోని వేంకటాచలస్వామికి ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామి వారికి అష్టోత్తర శతనామాలతో పూజాదికాలు జరిపిన అనంతరం గరుడవాహనంపై ఊరేగించారు. వైష్ణవ గోష్ఠి భక్తబృంద సభ్యులు గోవింద నామాలు స్మరిస్తూ ఈ సేవలో పాల్గొన్నారు. ముప్పరాజు శ్రీనివాసరావు, పద్మ, శృతి ఈ సేవ జరిపించారని ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు తెలిపారు.

పీ4 సర్వేపై ప్రజల ఆందోళన

- 27 ప్రశ్నలతో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- మంచికా, పథకాల్లో కోతకా అని ప్రజల్లో చర్చ
- అయోమయంలో ప్రజలు

నూజివీడు: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రోజుకో సర్వే పేరుతో ఇంటింటికి సచివాలయ సిబ్బందిని పంపుతుండటంతో ప్రజల్లో అయోమయం, ఆందోళన నెలకొంది. ఈ సర్వేలు మంచి చేయడానికా, పథకాలు ఏమీ రాకుండా అడ్డుకోవడానికా అని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి రాగానే ఐదేళ్లలో మహిళలకు ఏదో వస్తుందని లెక్కలేసి పాంప్లెట్లు పంచి నమ్మించారు. నమ్మి ఓట్లేయగా అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం ఇప్పటికీ సూపర్ సిక్స్ పథకం అమలు చేయకుండా రోజుకో మాట చెబుతోంది. పథకాల అమలు వదిలేసి వర్క్‌ఫ్రం హోం, పీ–4 సర్వే అంటూ సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం ఇంటింటికి తిప్పుతోంది. ఈ సర్వే ఈ నెల 18 వరకు నిర్వహించనున్నారు. ప్రజలు చెప్పే సమాధానాలను సచివాలయ ఉద్యోగులు ఒక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో 9,281 కుటుంబాలకు గాను 3,011 కుటుంబాల సర్వేను పూర్తి చేశారు.

పథకాలు రాకుండా చేసేందుకేనా?

కూటమి ప్రభుత్వం ఎవరికీ అర్థం కాకుండా పీ–4 సర్వే అంటూ చేయిస్తోంది. పీ–4 అంటే సామాన్యులకు ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఉంది. ఈ సర్వేలో సచివాలయ సిబ్బంది 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానం సేకరిస్తున్నారు.



నూజివీడు పట్టణంలో పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఫోన్, స్మార్ట్ టీవీ, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, ఇతర గృహోపకరణాలు ఉన్నాయా, ద్విచక్ర వాహనం, కారు ఉందా, ఇల్లు రేకులా, పెంకులా, శ్లాబా అంటూ అనేక రకాల ప్రశ్నలు ఈ సర్వేలో ఉండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నప్పటికీ నేడు టీవీ, ద్విచక్ర వాహనం లేని కుటుంబాలు ఉంటాయా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇవన్నీ అడిగేటప్పుడు బ్యాంకుల్లో అప్పు ఎంత ఉంది, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు ఎంత ఉందన్న ప్రశ్నలు కూడా అడగాల్సిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలేవీ ఇవ్వకుండా ఉండేందుకే అన్ని వివరాలను సర్వే పేరుతో సేకరిస్తోందని, పీ–4 ఏమో గాని తమ కొంప మునుగుతుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

సరైన పౌర సమాచారం కోసమే..

సర్వేలో సిబ్బంది పొందుపరిచే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో సాధారణ అంశాలే. ఈ సర్వేలో ఎవరైనా తమ వివరాలు చెప్పడానికి నిరాకరిస్తే వారి పేర్లను నమోదు చేయాలనే ఆదేశాలు ఉండటం గమనార్హం. సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందించేందుకే పీ-4 సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్ర స్థాయిలో సిబ్బందికి అధికారులు చెప్తున్నా ప్రజల్లో మాత్రం పథకాల కోతకేననే అనుమానం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు

మండలం	పేద కుటుంబాల సంఖ్య
నూజివీడు టౌన్	13,648
నూజివీడు	23,922
ఆగిరిపల్లి	20,769
ముసునూరు	18,515
చాట్రాయి	17,331
మొత్తం	94,185

ముమ్మరంగా సాగుతోంది



పట్టణంలో పీ-4 సర్వేను సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే ఈ నెల 8వ తేదీన ప్రారంభం కాగా, 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. సర్వేలో ఉన్న అంశాలన్నింటినీ కుటుంబాల వారిని అడిగి నమోదు చేస్తున్నారు.

– ఆర్.వెంకటరామిరెడ్డి, కమిషనర్, నూజివీడు మున్సిపాలిటీ

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నూజివీడు నియోజకవర్గంలో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 3,533 మంది విద్యార్థులు

నూజివీడు: పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు నియోజకవర్గంలోని నూజివీడు, నూజివీడు టౌన్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని 17 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 3,533 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో బెంచీలను ఏర్పాటు చేశారు. నూజివీడు పట్టణంలో ఏడు, నూజివీడు మండలంలో రెండు, ఆగిరిపల్లిలో మూడు, ముసునూరులో మూడు,



నూజివీడులో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ హైస్కూల్

చాట్రాయి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయ్యింది.

నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	రెగ్యులర్ విద్యార్థులు	ప్రైవేటు విద్యార్థులు	మొత్తం
నూజివీడు	1,841	57	1,898
ఆగిరిపల్లి	567	19	586
ముసునూరు	594	07	601
చాట్రాయి	435	13	448
మొత్తం	3,437	96	3,533

అన్ని సౌకర్యాలు కల్పించాం



నియోజకవర్గంలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎంలు ఉంటారు. మంచి నీటి సదుపాయం కల్పించాం. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

– ఎం.సేవియా, డీవైఈఓ, నూజివీడు

విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడలు, సాంస్కృతిక వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడల్లో ప్రావీణ్యం కలిగిన వారికి ప్రజల్లో పేరు ప్రఖ్యాతలు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కోశాధికారి ముత్యాల కిశోర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఉత్సాహంగా హోలీ



పోతనపల్లిలో రంగులు చల్లుకుంటున్న యువకులు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోతనపల్లి చిన్న తండా, పెద్ద తండాల్లో గిరిజన యువత ఒకరిపై ఒకరు రంగులు చిమ్ముకుంటూ ఉల్లాసంగా హోలీ పండుగను జరుపున్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని ప్రజలు శుక్రవారం హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆగిరిపల్లిలో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సందడి చేస్తూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం

ముసునూరు: మండలంలోని లోపూడి శివారు బాసవరప్పాడులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణాన్ని, ముసునూరులోని చారిత్రక వెంకటాచల స్వామివార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. బాసవరప్పాడులో శుక్రవారం భక్తులు గోపయ్య స్వామి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏడు వేల మందికి అన్నదానం చేశారు. అలాగే అలివేలు మంగమ్మ సమేత వెంకటాచలస్వామి వారికి అశేష భక్తజన సాక్షిగా అర్చకులు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు కల్యాణ క్రతువు నిర్వహించారు.



బాసవరప్పాడులో అమ్మవారి కల్యాణం

ఎన్టీటీపీఎస్ సీఈ నాగరాజుకు అభినందన



సీఈ నాగరాజును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తి చేసుకున్న టి.నాగరాజును పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన సేవలు గుర్తించి శాలువా, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సత్యప్రసాద్, బి.పాపారావు, ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, కోశాధికారి వెంకటరావు, ప్రచార కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ, మురళీకృష్ణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు శనివారం నిర్వహిస్తామని విద్యుత్ శాఖ రూరల్ డివిజన్ ఈఈ ఎం.వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ముత్తవరపు కల్యాణ మండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే సదస్సులో సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు, ఇతర ఫోరం సభ్యులు, అధికారులు పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా సమర్పించాలని చెప్పారు. విద్యుత్ అంతరాయాలు, సర్వీస్, కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులు, మీటర్, బిల్లుల సమస్యలపై తమ సర్వీస్ నంబర్, పూర్తి అడ్రస్, సెల్ ఫోన్ నంబర్‌తో అర్జీలు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ముసునూరు: మండలంలోని చెక్కపల్లి, గుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని చెక్కపల్లి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ మంద రాజ్‌కుమార్ తెలిపారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా తెల్లవారుజాము నాలుగు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు, ఉదయం పదకొండు నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరా ఉంటుందని తెలిపారు.

హీల్ సంస్థ సేవలు అభినందనీయం

ఆగిరిపల్లి: దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేసి వారికి కొత్త జీవితాన్ని అందజేయడానికి కృషి చేస్తున్న హీల్ సంస్థ సేవలు అభినందనీయమని అమెరికాకు చెందిన ఒరాకిల్ కంపెనీ గ్రూప్ వైస్ చైర్మన్ తుమ్మల గోపి అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ పబ్బ సరస్వతి అందజేసిన ఆర్థిక సాయంతో నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. తుమ్మల గోపి మాట్లాడుతూ హీల్ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండవ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మండవ శ్రీధర్, హెచ్ఓడీ మొహమ్మద్, కోనేరు ఉదయ్, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహనా ర్యాలీ

మైలవరం: మైలవరం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహనా ర్యాలీ శనివారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

మైలవరం: మొక్కజొన్నను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మైలవరం మండలం కొత్తగూడెం, మంగాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మొక్కజొన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,280 ప్రకటించిందని, కానీ గ్రామాల్లోని ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్ వరకు రాకుండా రూ.2 వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది దిగుబడులు తగ్గి పెట్టుబడులు రాక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమం కూల్చివేతకు ఖండన

మైలవరం: కడప జిల్లా బద్వేలులో పేదలకు అన్నదానం చేస్తున్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం కూల్చివేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. రెడ్డి అన్న పదం ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా కనబడకుండా చేసేందుకు ఆశ్రమాన్ని కూల్చివేయడం హేయమైన చర్య అని ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. అటవీ ప్రాంతం అనే కారణంతో నిత్యాన్న దాన ఆశ్రమాన్ని కూల్చివేయడం సామాజికవర్గ నేపథ్యంలో జరిగిందని ఆరోపించారు.

16న క్షేత్ర సందర్శన

ఈ హేయమైన చర్యలను ఖండిస్తూ మార్చి 16న మధ్యాహ్నం ఒంటి గంటకు క్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టామన్నారు. రాజకీయాలకు, కులాలకు అతీతంగా కాశిరెడ్డి నాయన ఆశ్రమాన్ని కాపాడుకుందామని, నిత్యాన్నదానాన్ని కొనసాగిద్దామనే నినాదంతో వేలాదిగా ప్రజలు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం పిలుపునిచ్చింది.

సారా నిర్మూలనకు కృషి చేద్దాం

నూజివీడు: గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య అన్నారు. మండలంలోని పల్లెర్లమూడిలో మస్తానయ్య నేతృత్వంలో శుక్రవారం సారా నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్ట ప్రకారం నేరమేనన్నారు. గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి ఎవరైనా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే కమిటీ సభ్యులకు తెలపాలన్నారు. అనంతరం ప్రచార రథం ద్వారా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సహకారంతో విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం గొల్లపూడిలోని శ్రీదత్త కల్యాణ మండపంలో ఏర్పాటు చేశామని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు బీపీ, షుగర్‌తోపాటు ఈసీజీ, 2డిఎకో స్క్రీనింగ్, హెచ్‌బీఏ1సీ, పీఎఫ్‌టి వైద్య పరీక్షలు చేస్తామన్నారు. గుండె, మెదడు, నరాలు, ఎండోక్రైనాలజీ, శ్వాస కోశ, ఎముకలు, కీళ్లు, స్త్రీ ప్రసూతి, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు పాల్గొంటారని చెప్పారు. గొల్లపూడి పరిసర ప్రాంతవాసులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా విక్రేతకు రిమాండ్

అన్నేరావుపేట(జి.కొండూరు): రెడ్డిగూడెం మండల పరిధి అన్నేరావుపేట గ్రామంలో సారా అమ్ముతున్న భరోతు రాముని ఎక్సైజ్ శాఖ సీఐ జె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం. దుర్గాప్రసాద్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని మైలవరం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడు రాముకి సారా సరఫరా చేసిన చాట్రాయి మండలం గంటిపాడుకు చెందిన భరోతు కుమార్‌పై కేసు నమోదు చేశారు.

వినికిడి యంత్రాల అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పలువురికి హియరింగ్ మిషన్లను శుక్రవారం అందజేశారు. వినికిడి లోపం కలిగిన బాధితుల విజ్ఞప్తి మేరకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి వీటిని అందజేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు బి.కృష్ణారెడ్డి, బుల్లిరాజు చౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

తిరువూరు: అసంఘటిత రంగ కార్మికులకు గతంలో ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ తిరువూరులో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. నాగేంద్రప్రసాద్ చైతన్యయాత్రలో పాల్గొని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటోవర్కర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన రూ.10 వేలు కొనసాగించాలని, ప్రమాద బీమా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కులు హరించే 12, 14 నంబరు సర్క్యులర్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు ఎస్‌వీ భద్రం, ఎ. రవి, బి. వెంకటేశ్వరరావు, ఇశ్రాయేలు, సురేష్, రాము పాల్గొన్నారు.

పిట్లవారిగూడెం ఎత్తిపోతల పథకం సర్వే

చాట్రాయి: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని పిట్లవారిగూడెం వద్ద నిర్మించనున్న ఎత్తిపోతల పథకంపై సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం సర్వే సిబ్బంది వివిధ ప్రాంతాల్లో తిరిగి సర్వే చేశారు. ఈ పథకం ద్వారా నరసింహారావుపాలెం, సి.గుడిపాడు, పర్వతాపురం, చనుబండ, కృష్ణారావుపాలెం గ్రామాలకు సాగు నీరు అందించనున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సుమారు 65 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మూడు రోజుల కిందట మైలవరం బస్టాండ్‌లో అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు బ్లూ కలర్ టీ షర్ట్, బ్లూ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఎత్తు 5 అడుగుల మూడు అంగుళాలు, చామను చాయ రంగు, బట్టతల కలిగి ఉన్నాడు. ఇతని ఆచూకీ తెలిసిన వారు మైలవరం సీఐ, ఎస్ఐని సంప్రదించవచ్చు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Limited, తిరువూరు బ్రాంచి వారి ... [illegible]

తిరువూరు, తేది: 14-03-2025 — చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, సెల్: 94407 64148

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Limited, తిరువూరు ... [illegible]

తిరువూరు, తేది: 14-03-2025 — చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, సెల్: 94407 64148



